భారత్ జయకేతనం

ఐదు టెస్టుల సిరీస్ కైవసం • ధర్మశాలలో ఘన విజయం • ఐదు వికెట్లతో అశ్విన్ విజృంభణ • ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 195 ఆలౌట్

అంతా అనుకున్నట్లే జరిగింది. ముచ్చటగా మూడు రోజుల్లో ముగిసిన ఐదో టెస్టులో భారత్ విజయదుందుభి మోగించింది. దౌలాదర్ పర్వత శ్రేణుల్లో ఇంగ్లండ్‌ను మట్టికరిపిస్తూ టీమ్‌ఇండియా ఇన్నింగ్స్ తేడాతో భారీ గెలుపు అందుకుంది. సీనియర్ స్పిన్నర్ అశ్విన్ ఐదు వికెట్లతో విజృంభించిన వేళ ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 195 పరుగులకు కుప్పకూలింది. రూట్(84) ఒంటరిపోరాటం మినహా అందరూ పేలవ ప్రదర్శన కనబరిచారు. సిరీస్‌ను 4-1తో కైవసం చేసుకున్న భారత్ డబ్ల్యూటీసీ చాంపియన్‌షిప్‌లో తమ అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది.

ధర్మశాల: భారత్ సొంతగడ్డపై బెబ్బులిలా గర్జించింది. సీనియర్ల గైర్హాజరీలో ఏ మాత్రం తొణకని, బెణకని టీమ్‌ఇండియా..ఇంగ్లండ్ భరతం పట్టింది. మూడు రోజుల్లోనే ముగిసిన ఐదో టెస్టులో ఇన్నింగ్స్ 64 పరుగుల తేడాతో భారీ విజయం ఖాతాలో వేసుకుంది. ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను 4-1తో కైవసం చేసుకుని ఔరా అనిపించింది. శనివారం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఇంగ్లండ్..వందో టెస్టు ఆడుతున్న అశ్విన్(5/77) ధాటికి 195 పరుగులకే కుప్పకూలింది. మిడిలార్డర్ బ్యాటర్ జో రూట్(128 బంతుల్లో 84, 12 ఫోర్లు) ఒక్కడే పోరాటం చేయగా, బెయిర్‌స్టో(39) ఫర్వాలేదనిపించాడు. జాక్ క్రాలీ(0), డకెట్(2), కెప్టెన్ స్టోక్స్(2), బెన్ ఫోక్స్(8), మార్క్ వుడ్(0) తీవ్రంగా నిరాశపరిచారు. కుల్దీప్‌యాదవ్(2/40), బుమ్రా(2/38) రెండేసి వికెట్లు తీశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 473/8తో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 477 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్లు కుల్దీప్(30), బుమ్రా(20) తమ ఇన్నింగ్స్‌ను కొనసాగించలేకపోయారు. కుల్దీప్‌ను ఔట్ చేయడం ద్వారా అండర్సన్ టెస్టుల్లో 700 వికెట్ల ఫీట్‌ను చేరుకున్నాడు. షోయబ్ బషీర్(5/173) ఐదు వికెట్లతో రాణించగా, అండర్సన్(2/60), హార్ట్‌లే (2/126) రెండేసి వికెట్లు తీశారు. జైస్వాల్(712)కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్', కుల్దీప్‌యాదవ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కాయి.

సంక్షిప్త స్కోరు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 218 ఆలౌట్, **భారత్ తొలి ఇన్నింగ్స్:** 477 ఆలౌట్(గిల్ 110, రోహిత్ 103, బషీర్ 5/173, అండర్సన్ 2/60), **ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్:** 195 ఆలౌట్ (రూట్ 84, బెయిర్‌స్టో 39, అశ్విన్ 5/77, బుమ్రా 2/38)

టెస్టులకు బీసీసీఐ బోనాంజా

75 శాతం టెస్టులు ఆడితే మ్యాచ్‌కు 45 లక్షలు

ముంబై: టెస్టు క్రికెట్‌కు మరింత ప్రాధాన్యం ఇవ్వాలన్న ఉద్దేశంతో బీసీసీఐ కొత్త స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. 'టెస్టు క్రికెట్ ఇన్సెంటివ్ స్కీమ్'ను బోర్డు శనివారం ప్రకటించింది. దీని ప్రకారం ఒక సీజన్‌లో 75 శాతం కంటే ఎక్కువ టెస్టు మ్యాచ్‌లు ఆడితే ఒక్కో పోరుకు రూ.45 లక్షల ఇన్సెంటివ్ ఇవ్వనుంది. ప్రస్తుతమున్న మ్యాచ్ ఫీజు రూ.15లక్షలకు ఇది అదనం. 50 శాతం కంటే ఎక్కువ మ్యాచ్‌లు ఆడితే రూ.30లక్షల ఇన్సెంటివ్ ఇస్తామని బీసీసీఐ కార్యదర్శి జై షా ప్రకటించాడు. 2022-23 సీజన్ నుంచే ఇది అమలు చేస్తామని షా పేర్కొన్నాడు. ఇదిలా ఉంటే ఒక సీజన్‌లో పది టెస్టులు ఆడే క్రికెటర్‌కు మ్యాచ్ ఫీజు 15 లక్షలతో పాటు 4.5 కోట్ల ఇన్సెంటివ్ లభిస్తుంది.

డబ్ల్యూటీసీ నం.1

దుబాయ్: ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ)లో భారత్ టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నది. ఇంగ్లండ్‌తో ఐదో టెస్టులో ఇన్నింగ్స్ 64పరుగుల తేడాతో గెలువడం ద్వారా టీమ్‌ఇండియా తమ పాయింట్ల శాతాన్ని 64.58 నుంచి 68.51కు పెంచుకుంది. ప్రస్తుత డబ్ల్యూటీసీ చాంపియన్‌షిప్‌లో భారత్ ఆరు మ్యాచ్‌ల్లో గెలిచి రెండు ఓటములు, ఒక మ్యాచ్ డ్రా చేసుకుంది. యువ క్రికెటర్లతో సిరీస్ గెలిచి భారత్ టాప్‌లోకి దూసుకొచ్చిందని ఐసీసీ పేర్కొంది.

అండర్సన్ @ 700

ఇంగ్లండ్ స్టార్ పేసర్ జేమ్ అండర్సన్ అరుదైన రికార్డు అందుకున్నాడు. సుదీర్ఘ టెస్టు క్రికెట్ చరిత్రలో 700 వికెట్ల మైలురాయిని చేరుకున్న తొలి పేసర్‌గా అండర్సన్ రికార్డుల్లోకెక్కాడు. భారత్‌తో ఐదో టెస్టులో కుల్దీప్‌యాదవ్‌ను ఔట్ చేయడం ద్వారా అండర్సన్ ఈ ఫీట్ అందుకున్నాడు. ఓవరాల్‌గా టెస్టుల్లో మురళీధరన్(800), షేన్ వార్న్(708) తర్వాత మూడో స్థానంలో నిలిచాడు.

భారత జూనియర్ జట్టులోకి సంగీత

హైదరాబాద్, ఆట ప్రతినిధి: లక్నో వేదికగా జరుగుతున్న 22వ జాతీయ జూనియర్ అండర్-20 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ అథ్లెట్ సాయిసంగీత పసిడి పతకంతో మెరిసింది. హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో శిక్షణ పొందుతున్న సంగీత భారత జూనియర్ అథ్లెటిక్స్ జట్టుకు ఎంపికైంది. శనివారం జరిగిన మహిళల 400మీటర్ల రేసును సంగీత 55.13 సెకన్ల టైమింగ్‌తో అగ్రస్థానంలో నిలిచింది. అనుష్క, కనిస్టా ఆ తర్వాత స్థానాల్లో నిలిచారు.

సంహితకు కాంస్యం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: మలేషియా వేదికగా జరిగిన కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర యువ చెస్ ప్లేయర్ సంహిత పుంగవనం కాంస్య పతకంతో మెరిసింది. బాలికల అండర్-10 విభాగంలో పోటీకి దిగిన సంహిత 7/9 స్కోరుతో ఆకట్టుకుంది. ప్రత్యర్థులకు దీటైన పోటీనిచ్చిన సంహిత మెరుగైన ప్రదర్శన కనబరిచింది.

హైదరాబాద్ నిష్క్రమణ

చెన్నై: ప్రైమ్ వాలీబాల్ లీగ్(పీవీఎల్)లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ పోరాటం ముగిసింది. శనివారం జహహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ 12-15, 12-15, 11-15తో కొచ్చి బ్లూస్పైకర్స్ చేతిలో ఓటమిపాలైంది. ఏ దశలోనూ కొచ్చికి దీటైన పోటీనివ్వలేకపోయిన హైదరాబాద్ మూల్యం చెల్లించుకుంది. టోర్నీలో ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లో ఏడింటిలో ఓడిన హైదరాబాద్ రెండు పాయింట్లతో తొమ్మిదో స్థానానికి పరిమితమైంది.

హుసామ్ ఓటమి

బుస్టో అర్సిజియో(ఇటలీ): వరల్డ్ ఒలింపిక్ క్వాలిఫయర్ టోర్నీలో భారత యువ బాక్సర్ మహమ్మద్ హుసాముద్దీన్‌కు నిరాశే ఎదురైంది. శనివారం జరిగిన పురుషుల 57కిలోల బౌట్‌లో హుసామ్ 0-4 తేడాతో జ్యూడ్ గాల్గర్(ఐర్లాండ్) చేతిలో ఓటమిపాలయ్యాడు. గాయం నుంచి తేరుకుని బరిలోకి దిగిన ఈ ఇందూరు బాక్సర్ స్థాయికి ఆటతీరు ప్రదర్శించడంలో విఫలమయ్యాడు. టోర్నీ తొలి రౌండ్‌లో బై అందుకున్న హుసామ్ ముందంజ వేయలేకపోయాడు. 2023 ప్రపంచ చాంపియన్‌షిప్ తర్వాత పోటీకి దిగిన ఈ యువ బాక్సర్..ప్రత్యర్థి బాక్సర్‌కు దీటైన పోటీనివ్వలేకపోయాడు. బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ విజేత అయిన గాల్గర్ దూకుడు ప్రదర్శిస్తూ కీలక పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు. టోర్నీలో భారత్ తరఫున తొమ్మిది మంది బాక్సర్లు పోటీకి దిగగా, నిశాంత్‌దేవ్(71కి) ఒక్కడే ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశించాడు.

ఆధిక్యంలో కివీస్

క్రైస్ట్‌చర్చ్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్టులో న్యూజిలాండ్ స్వల్ప ఆధిక్యం సాధించింది. వందో టెస్టు ఆడుతున్న కేన్ విలియమ్సన్ (51)తో పాటు టామ్ లాథమ్(65 బ్యాటింగ్) అర్ధసెంచరీలతో కివీస్ రెండో ఇన్నింగ్స్‌లో రెండు వికెట్ల నష్టానికి 134 స్కోరు చేసింది. లాథమ్‌తో పాటు రచిన్ రవీంద్ర (11) క్రీజులో ఉన్నాడు. మూడు రోజులు మిగిలున్న మ్యాచ్‌లో కివీస్ 40 పరుగుల స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతున్నది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 124/4తో తొలి ఇన్నింగ్స్‌కు దిగిన ఆసీస్..256 పరుగులకు ఆలౌటైంది. మ్యాట్ హెన్రీ (7/67) విజృంభణతో కంగారూ బ్యాటర్లు కుదేలయ్యారు. లబుషేన్ (90) ఒంటరిపోరాటం మినహా అందరూ స్వల్ప స్కోర్లకు పరిమితమయ్యారు.

ముంబై X విదర్భ

నేటి నుంచి రంజీ ఫైనల్

ముంబై: రంజీ ట్రోఫీ ఫైనల్ సమరానికి రంగం సిద్ధమైంది. ఆదివారం నుంచి వాంఖడే స్టేడియం వేదికగా ముంబై, విదర్భ జట్లు టైటిల్ పోరులో తలపడనున్నాయి. ముంబై 42వ రికార్డు టైటిల్‌పై కన్నేస్తే..సమిష్టి ప్రదర్శనను నమ్ముకున్న విదర్భ ట్రోఫీని ముద్దాడాలని చూస్తున్నది. రహానే నేతృత్వంలోని ముంబై ఈ సీజన్‌లో అదరగొడుతున్నది. ముఖ్యంగా ఆఖరి వరుస ప్లేయర్లు కూడా బ్యాటింగ్‌లో విజృంభిస్తున్నారు. భూపేన్ లల్వాణి(533), తనుష్ కొటియాన్ (481) టాప్‌గేర్‌లో దూసుకెళుతున్నారు. రహానేకు తోడు శ్రేయాస్ అయ్యర్, శార్దుల్ ఠాకూర్ ఉండటం ముంబైకి కలిసిరానుంది. మరోవైపు విదర్భ తరఫున బ్యాటింగ్‌లో కరుణ్ నాయర్ (616), ధృవ్ షోరె(549), బౌలింగ్‌లో ఆదిత్య సర్వాతె(40 వికెట్లు), శైలేష్(33) అదరగొడుతున్నారు.

లంకదే టీ20 సిరీస్

బంగ్లాపై విజయం

సిల్హెట్(బంగ్లాదేశ్): బంగ్లాదేశ్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను శ్రీలంక కైవసం చేసుకుంది. శనివారం జరిగిన ఆఖరి పోరులో లంక 28 పరుగుల తేడాతో బంగ్లాపై విజయం సాధించింది. తొలుత లంక నిర్ణీత 20 ఓవర్లలో 174/7 స్కోరు చేసింది. కుశాల్ మెండిస్(86) అర్ధసెంచరీతో కదంతొక్కాడు. తస్కిన్ అహ్మద్, రిషాద్ హుస్సేన్ రెండేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన బంగ్లా..19.4 ఓవర్లలో 146 పరుగులకు పరిమితమైంది. నువాన్ తుషార (5/20) ఐదు వికెట్లతో బంగ్లా పతనాన్ని శాసించాడు. రిషాద్ హుస్సేన్ (53) ఒక్కడే ఫర్వాలేదనిపించాడు. తుషారకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', కుశాల్ మెండిస్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' దక్కింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.